సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 30 । మే । 2024



1న హనుమాన్ శోభాయాత్ర

వేములవాడ: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జూన్ 1న పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు హిందూ ఉత్సవ సమితి నాయకులు తెలిపారు.



మండుటెండల్లో నిండుకుండలా..

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం రంగంపేట శివారులోని జంపన్నచెరువు మండు వేసవలోనూ నీటితో కళకళలాడుతుంది. గ్రామంలోని పశువుల దాహార్తిని తీరుస్తుంది.

గరిష్టం/కనిష్టం
43.0/36.0

వాతావరణం

వాతావరణం వేడిగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

హైబ్రిడ్ పత్తి విత్తనాలు సాగుచేయాలి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): పత్తివిత్తనాలు అన్ని కంపెనీల నుంచి బోల్‌గాడ్–2 టెక్నాలజీలోనే ఉత్పత్తి అవుతాయని రైతులు గుర్తించాలని జిల్లా వ్యవసాయాధికారి వడ్డేపల్లి భాస్కర్ పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలం పొత్తూరులో బుధవారం విత్తన దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. పత్తివేసే రైతులు రెండు, మూడు రకాల హైబ్రిడ్ పత్తి రకాలను సాగుచేసుకోవాలని సూచించారు. దిగుబడి వాతావరణ అనుకూలత, నేల స్వభావాన్ని బట్టి ఉంటుందని తెలిపారు.

దత్తాత్రేయ ఆలయానికి వంతెన కోసం సర్వే



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులోని వరదవెల్లిగుట్టపై గల దత్తాత్రేయస్వామి ఆలయానికి వెళ్లేందుకు వంతెన నిర్మాణానికి మిడ్‌మానేరు డీఈ అప్పన్నగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం సర్వే చేశారు. మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీరు ఉన్న సమయంలో ఆలయానికి వెళ్లేందుకు భక్తులు పడుతున్న ఇబ్బందులను కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ గతంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి పొన్నం మిడ్‌మానేరు ఎస్‌ఈకి లేఖ రాశారు. ఈక్రమంలోనే డీఈ శ్రీనివాస్ గత ఫిబ్రవరిలో స్థలాన్ని పరిశీలించారు. రెండో సర్వే బుధవారం చేపట్టారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



వేములవాడరూరల్: పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీపీవో వీరబుచ్చయ్య సిబ్బందికి సూచించారు. వేములవాడరూరల్ మండలం నూకలమర్రిలో బుధవారం తనిఖీలు చేపట్టారు. పల్లెప్రకృతివనం, క్రీడాప్రాంగణం, వైకుంఠధామం, కంపోస్టుషెడ్, తాగునీటి సరఫరా, నర్సరీలు పరిశీలించారు. ఎంపీవో రమేశ్, సెక్రెటరీ రమ ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు 379 మంది హాజరు

సిరిసిల్లఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం 379 మంది హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి మోహన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 399 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 20 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న మామిడిపల్లి రైతులు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లిలోని ఇసుకరీచ్‌తో తమ భూములు కోతకు గురవుతున్నాయని రైతులు బుధవారం ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇసుక తోడుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఇసుక రీచ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాల విద్యను బలోపేతం చేయాలి



సిరిసిల్లటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి పాఠశాల విద్యను బలోపేతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి కోరారు. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన విద్యనందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. దుమాల రమానాథ్ రెడ్డి, బాలచందర్ రాజు, పూరెల్ల రవీందర్, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, విక్కుర్తి అంజయ్య, సూర భాస్కర్ పాల్గొన్నారు.

నూలు వ్యాపారులు నలిపేస్తున్నారు!

- వడ్డీ చెల్లించాలంటూ వేధింపులు
- సిరిసిల్లలోనే తిష్ట.. వస్త్రోత్పత్తిదారులపై ఒత్తిళ్లు
- రూ.50కోట్ల వసూళ్లకు ప్రణాళిక

సాక్షి కథనం



సిరిసిల్లకు చేరిన నూలు బ్యాగులు

సిరిసిల్ల: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో మూడు అంచెల వ్యవస్థ అమలులో ఉంది. కానీ ఈ మూడు వ్యవస్థలను శాసించే నాలుగో వ్యవస్థ నూలు(యారన్) వ్యాపారులు. సిరిసిల్ల వస్త్రవ్యాపారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్న నలుగురు బడా నూలు వ్యాపారులు ఇప్పుడు సిరిసిల్లలో తిష్టవేసి అప్పులు, ఆ అప్పులకు వడ్డీలు చెల్లించాలని స్థానిక వస్త్రోత్పత్తిదారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరలకు సంబంధించిన రూ.150 కోట్లను విడుదల చేయడంతో బకాయిల వసూలుకు హైదరాబాద్‌కు చెందిన నూలు వ్యాపారులు జిల్లా కేంద్రంలోని గోపాల్‌నగర్‌లోని ఓ ప్రైవేటు లాడ్జీలో దిగారు. వడ్డీ చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. నూలు వ్యాపారుల వేధింపులపై 'సాక్షి' కథనం.

ఉద్దెర భేరం.. వడ్డీల భారం

వస్త్రపరిశ్రమలో 27వేల మరమగ్గాలు, అనుబంధ రంగాలతో కలిపి 15వేల నేత కార్మికులు పనిచేస్తున్నారు. ఉద్దెర భేరంతో వడ్డీల భారం తప్పడం లేదు. సిరిసిల్లలోని 50 మంది బడాసేట్లు ఉద్దెరగా నూలు కొని, సరఫరా చేసిన నలుగురు వ్యాపారులకు 18 నుంచి 24 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు. ఈ 50 మంది యజమానులపై ఆధారపడి సిరిసిల్లలో 5 వేల మంది ఆసాములు, 10 వేల మంది కార్మికులు జీవిస్తున్నారు. కానీ ఈ వస్త్రపరిశ్రమ నలుగురు నూలు వ్యాపారులు సందీప్‌భాయ్, రమణ్‌భాయ్, సూర్యాకాంత్, రాకేశ్‌భాయ్‌లపై ఆధారపడి ఉంది. ఆ నలుగురు మార్వాడీ వ్యాపారులు నూలు అందిస్తేనే.. ఇక్కడ సాంచాలు నడుస్తాయి. బతుకమ్మ చీరల ఆర్డర్లు రావడంతో రూ.కోట్ల విలువైన నూలు అవసరం. దీంతో సిరిసిల్ల సేట్లు ఆ నలుగురు హైదరాబాద్ నూలు వ్యాపారుల వద్ద ఉద్దెరగా కొనుగోలు చేయడం ప్రారంభించారు. ఉద్దెర భేరం కావడంతో నూలు వ్యాపారులు చెప్పిన ధర(బయట మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నా) చెల్లించాల్సిందే. టన్నుల కొద్దీ నూలు కొనుగోలుకు పెద్దమొత్తంలో పెట్టుబడి లేక సిరిసిల్ల సేట్లు 18 నుంచి 24 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు. మరో వైపు ప్రభుత్వం బతుకమ్మ చీరల బట్ట, ఇతర వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చి సకాలంలో ఇవ్వాలని గడువులు విధించి బట్టను సేకరిస్తుంది. కానీ ఆ బట్టకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో వస్త్రోత్పత్తిదారులపై వడ్డీల భారం పడుతుంది. బట్ట నేసిన ఆసాముల(సాంచాల యజమానులు)కు, పనిచేసిన కార్మికులకు నగదుగా ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా చేతిలోని డబ్బు ఆసాములకు, కార్మికులకు పోగా.. నూలు వ్యాపారుల వద్ద బకాయిలు, వడ్డీలు పెరిగిపోయాయి. ప్రభుత్వం నుంచి వస్త్రోత్పత్తిదారులకు ఇంకా రూ.200కోట్లు రావాల్సి ఉండగా.. ముందుగా విడుదలైన రూ.150కోట్లలో రూ.50 నుంచి రూ.60కోట్ల మేరకు ఆ నలుగురు నూలు వ్యాపారులకే చెల్లించాల్సి ఉంది. ముందు వడ్డీ చెల్లించాలని, అసలు తర్వాత చెల్లించాలని ఆ నలుగురు వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

చిన్నవ్యాపారుల విలవిల

సిరిసిల్లలో పెద్దసేట్లు నలుగురు ఉంటే.. చిన్న వ్యాపారులు 46 మంది ఉన్నారు. వీళ్లందరిపైన వస్త్రవ్యాపారం ఆధారపడి ఉంది. నూలు వ్యాపారులు పెద్ద సేట్ల జోలికి పోకుండా.. చిన్న వ్యాపారులను వేధిస్తున్నారు. సిరిసిల్లలో కొద్ది మంది సమూహంగా మ్యాక్స్‌లు, ఎస్‌ఎస్‌ఐలు ఉండగా.. జౌళిశాఖ అధికారులు నేరుగా ఆసాముల ఖాతాల్లోనే వస్త్రం డబ్బులు వేశారు. ఆ డబ్బులు పెట్టుబడి పెట్టిన వారికి రాకపోవడంతో కొత్త పంచాయితీలు మొదలయ్యాయి. ఇంకా రావాల్సిన బకాయిలు బాగానే ఉండగా.. మొదటి విడత డబ్బులు తమకే కావాలంటూ నూలు వ్యాపారులు వేధిస్తున్నారు.

రూ.కోట్లకు ఎదిగిన నూలు వ్యాపారులు

ప్రభుత్వం 2017 నుంచి వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వడంతో హైదరాబాద్ నూలు వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ.కోట్లకు ఎదిగారు. సిరిసిల్లకు ఏటా వచ్చే రూ.370 కోట్ల ఆర్డర్లలో ఎక్కువ మొత్తంలో ప్రయోజనం పొందింది ఆ నలుగురు నూలు వ్యాపారులే. 'వాళ్లు చెప్పిందే ధర.. పంపిందే నూలు'.. అన్నట్లుగా సంపాదించారు. నూలు కంపెనీలు సైతం సిరిసిల్ల వ్యాపారులకు నేరుగా ఇవ్వకుండా.. ఆ నలుగురు వ్యాపారుల(ఏజెంట్ల)కే ఇచ్చాయి. ఇలా నూలు సరఫరాలో అనివార్యంగా ఆ నలుగురిపైనే సిరిసిల్ల వస్త్రపరిశ్రమ ఆ'ధార'పడింది. ఆ నలుగురు చేనేత, జౌళిశాఖ, టెస్కో ఉన్నతాధికారులకు ముడుపులు ఇచ్చి మచ్చిక చేసుకోవడంతో.. వారు చెప్పిందే నడిచింది. ఆ నలుగురు వ్యాపారులు సూచించిన కంపెనీలకు చెందిన నూలు కొనాలనే నిబంధనలు పెట్టడంతో వారు రూ.కోట్లకు ఎదిగారు.



వస్త్రోత్పత్తికి వినియోగించే నూలు

ఇప్పుడేం చేయాలి ?

చిన్నవ్యాపారులను వడ్డీల కోసం వేధిస్తున్న హైదరాబాద్ నూలు వ్యాపారులను కట్టడి చేయాలి. ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా అధిక వడ్డీలు వసూలు చేస్తున్న ఆ నలుగురు వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏడేళ్లుగా సిండికేట్ దందా చేసిన ఆ వ్యాపారుల ఆస్తులపై విచారణ చేపడితే.. సిరిసిల్లను నలిపేసిన దందాలు వెలుగులోకి వస్తాయి. ప్రభుత్వ పరంగా నూలు డిపోలు ఏర్పాటు చేస్తే.. చిన్నవ్యాపారులు తమ అవసరాల మేరకు నూలు కొని బట్ట నేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకుంటే సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు వడ్డీల భారం దూరమవుతుంది. బట్ట నేసిన నేతన్నలకు ఉపాధి లభిస్తుంది.

పరీక్ష కేంద్రాలకు ముందే చేరుకోవాలి



సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

- గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: గ్రూప్–1 పరీక్షలు రాసే అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ అనరాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 9న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని 15 పరీక్ష కేంద్రాల్లో 4,699 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వివరించారు. ఏమైనా సమస్యలుంటే కంట్రోల్ రూమ్ 93986 84240కు ఫోన్ చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో టేబుల్ డెస్కులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలస్యమైతే అనుమతించబోరని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు తప్ప ఎవరికీ మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఎస్.ఖీమ్యా నాయక్, ఆర్డీవో శ్రీనివాస్, డీఐఈవో మోహన్, డీఈవో రమేశ్‌కుమార్, డీటీవో లక్ష్మణ్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విత్తనాల కొరత లేదు

జిల్లాలో విత్తనాల కొరత లేదని, వానాకాలం సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో వ్యవసాయ శాఖ సంచాలకులు హైదరాబాద్ నుంచి విత్తనాల లభ్యత, సరఫరాపై బుధవారం టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాకు ఇప్పటి వరకు జీలుగ విత్తనాలు 2,250 క్వింటాళ్లు కేటాయించారని, ఇప్పటికే 1582.20 క్వింటాళ్లు రైతులకు అందించినట్లు తెలిపారు. మిగతా 667.80 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. జిల్లాలో గతేడాది 50,552 ఎకరాలు సాగుచేయగా, ఈ ఏడాది 49,215 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేసినట్లు వివరించారు. జిల్లాకు 1,76,000 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని, ఆమేరకు విత్తనాలు సరఫరా చేయాలని డీలర్లను ఆదేశించామన్నారు. ఇప్పటి వరకు 48,000 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, 5,670 విత్తన ప్యాకెట్లు రైతులు కొనుగోలు చేసినట్లు వివరించారు. ఏ కంపెనీ బీటీ–2 పత్తి విత్తనాలు కొన్నా దిగుబడిలో తేడా ఉండదన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ వద్దే విత్తనాలు కొని, రశీదు పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పోలీసులకు, వ్యవసాయశాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మరమ్మతు పనుల్లో వేగం పెంచండి

సాక్షి ఎఫెక్ట్..

ముస్తాబాద్(సిరిసిల్ల): అమ్మ ఆదర్శ పాఠశాలల్లోని మరమ్మతు పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అదనపు కలెక్టర్ గౌతమితో కలిసి ముస్తాబాద్, చీకోడు, పోతుగల్, మండెపల్లి, నేరెళ్ల స్కూళ్లలో చేపట్టిన పనులను బుధవారం పరిశీలించారు. సాక్షిలో 'సౌకర్యాలు దరి చేరేనా?' శీర్షికన 28న ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు జూన్ 5 నాటికి పూర్తి చేయాలన్నారు. బిల్లులకు ఇబ్బందులు లేవని, నిధులున్నాయని తెలిపారు. డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో రమేశ్‌కుమార్, డీఈఈ నాగరాజు, డీపీఎం సుధారాణి, ఎంపీడీవో రాజేందర్, ఏఈ నరేందర్, హెచ్‌ఎం రాధాకిషన్‌రావు ఉన్నారు.



పోతుగల్ స్కూల్‌లో ఆరా తీస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి

గడువులోగా యూనిఫామ్స్ అందించాలి

ముస్తాబాద్/తంగళ్లపల్లి(సిరిసిల్ల): యూనిఫామ్స్‌ను గడువులోగా అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గూడెం, మండెపల్లిలో యూనిఫామ్స్ కుడుతున్న కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు. 41,860 యూనిఫామ్స్ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 20,314 పూర్తయ్యాయని.. మిగతావి త్వరగా పూర్తి చేయాలన్నారు.

వామ్మో.. రోహిణి కార్తె

- దంచికొడుతున్న ఎండలు
- ఇల్లంతకుంటలో 43.7 డిగ్రీలు

సిరిసిల్ల: 'రోహిణి కార్తెలో రోకళ్లు పగిలే ఎండలు కొడుతాయని' నానుడి. నిజంగానే జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. ఈనెల 25న రోహిణీ కార్తె ప్రవేశించినప్పటి నుంచి ఎండలు మండిపోతున్నాయి. బుధవారం ఇల్లంతకుంట మండలంలో అత్యధికంగా 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెద్దూరులో 43.1, సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 42.7, మర్తనపేట, వట్టెంలలో 42.6, బోయినపల్లిలో 42.5, గంభీరావుపేటలో 42.2, కందికట్కూర్‌లో 42.1, ఎల్లారెడ్డిపేట, నాంపల్లిలో 42.0 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. నామాపూర్, గజసింగవరంలో 41.9, మర్రిగడ్డలో 41.6, నిజామాబాద్, ఆవునూర్, నేరెళ్లలో 41.4, పెద్దలింగాపూర్‌లో 41.2, మానాలలో 40.6, వీర్నపల్లి, రుద్రంగిలో 40.1 డిగ్రీల చొప్పున ఎండలు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో 33 డిగ్రీలకు మించి రికార్డయ్యాయి.




ఎండ ధాటికి నెత్తిన చున్నీతో వెళ్తున్న మహిళ



ఎంత హాయిలే ఇలా..

దంచి కొడుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నారులు, పెద్దలు ఈత కొలనులను ఆశ్రయిస్తున్నారు. సాయంత్రం వేళ ఈత కొడుతూ సరదాగా గడుపుతున్నారు. ఓ వైపు తమ పిల్లలకు ఈత నేర్పుతూనే వారు వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గీతానగర్‌లో పిల్లలు ఇలా ఈతకొడుతూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల





'అర్బన్' పోరులో సతులు!

- రాజకీయ ఎదుగుదలకు ఇక్కడి నుంచే బాటలు
- 12 డివిజన్లకు 105 మంది నామినేషన్లు
- చివరి రోజు 55 మంది 63 సెట్లు
- ముగిసిన అర్బన్‌బ్యాంకు నామినేషన్ల పర్వం

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. 12 డివిజన్లకు 105 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లుగా ఎన్నికల అధికారి టి.రామకృష్ణ బుధవారం తెలిపారు. నామినేషన్ల పరిశీలన గురువారం ఉండగా.. ఉపసంహకరణకు శుక్రవారం వరకు గడువు ఉంది. ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా వెల్లడవుతుంది. జూన్ 6న అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు జరుగనున్నాయి.



సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకులో డైరెక్టర్ స్థానాలకు నామినేషన్ వేస్తున్న అభ్యర్థి

బరిలో సతులు.. సుతులు

సిరిసిల్లలో రాజకీయంగా ఎదిగేందుకు సహకార అర్బన్‌బ్యాంకు ఎన్నికలు తొలిమెట్టుగా భావిస్తారు. అలాంటి వారు అర్బన్‌బ్యాంకు పాలకవర్గంలో స్థానం సంపాదించాలని ఆశిస్తారు. ఇందులో భాగంగా పరిమిత ఓట్ల అర్బన్‌బ్యాంకు ఎన్నికల్లో పలువురు నాయకులు తమ సతులను, సుతులను బరిలో దింపుతున్నారు. గతంలో అర్బన్ బ్యాంకు పాలకవర్గంలో ఉన్న వారు రాజకీయంగా గుర్తింపు సాధించడంతో అదే బాటలో పలువురు పట్టణ వాసులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు నామినేషన్లు దాఖలు చేశారు.

చివరి రోజు 55 నామినేషన్లు

నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన బుధవారం 55 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజు 23 నామినేషన్లు రాగా.. రెండో రోజు 27, చివరి రోజు 55 వచ్చాయి. అత్యధికంగా 1వ డివిజన్‌లో 11 మంది నామినేషన్లు వేయగా.. అత్యల్పంగా 2, 5వ డివిజన్లలో ఇద్దరి చొప్పున నామినేషన్లు వేశారు. 3వ డివిజన్‌లో నలుగురు, 4వ డివిజన్‌లో ఎనిమిది మంది, 6వ డివిజన్‌లో ఏడుగురు, 7లో ముగ్గురు, 8లో ఎనిమిది మంది, 9లో ఆరుగురు, 10లో ముగ్గురు, 11లో తొమ్మిది మంది, 12లో నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఎనిమిది మంది డబుల్ వేయడంతో నామినేషన్ల సంఖ్య 63కు చేరాయి. మొత్తంగా 12 డైరెక్టర్ స్థానాలకు 105 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడం విశేషం.

బయోగ్యాస్ ప్లాంట్.. ఉత్తముచ్చటేనా?

- రూ.31.60 లక్షలతో ఏర్పాటు
- వినియోగించని అధికారులు
- మూలకుపడ్డ ప్లాంట్

వేములవాడఅర్బన్: లక్ష్యం ఉత్తమమైనదే.. కానీ అధికారుల్లో చిత్తశుద్ధి లేకనే నిధులు వృథాగా పోతున్నాయి. రాజన్న గోశాలలోని కోడెల పేడ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలనే ఆలోచనతో ఏరియా ఆస్పత్రి సమీపంలో బయోగ్యాస్ విద్యుత్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు రాజన్నకు చెందిన నిధులు రూ.31.60 లక్షలతో ఈ ప్లాంట్‌ను నిర్మించారు. అయితే ఏడాదిగా అది నిరుపయోగంగానే ఉంటుంది.

కోడెమొక్కులు ఆనవాయితీ

దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్నకు కోడెమొక్కులు ప్రీతి. అనుకున్న పనులు జరిగితే కోడెను ఇస్తామని మొక్కిన భక్తుల ద్వారా రాజన్నకు ఏటా వందల సంఖ్యలో కోడెలు వస్తుంటాయి. అంతేకాకుండా కోడెమొక్కుల టికెట్ల ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం ఆలయానికి సమకూరుతోంది. రాజన్నకు ఆవుపాలతో అభిషేకం చేసేందుకు గోశాలలో ఆవులను పెంచుతుండగా, భక్తులు మొక్కులు చెల్లించేందుకు కోడెలను పెంచుతున్నారు. వీటి ద్వారా వచ్చే పేడతో బయోగ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏడాది క్రితం మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తి కావడంతో గతేడాది ప్రారంభించి, నిర్వహణ బాధ్యతలను రాజన్న ఆలయ ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించారు.



వేములవాడ రాజన్న గోశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్

నిత్యం 24 కిలోవాట్స్ విద్యుత్

రాజన్న గోశాలలోని కోడెలు, ఆవుల ద్వారా వచ్చే 2.5 టన్నుల పేడతో నిత్యం 24 కిలోవాట్స్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గోశాలలోని ఫ్యాన్లు, లైట్లు, మోటార్లకు 7 నుంచి 8 గంటలు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. అయితే పనులు పూర్తయినా పూర్తిస్థాయిలో ప్లాంట్ నడవలేదని తెలుస్తోంది. లక్షలు పెట్టి ఏర్పాటు చేసిన బయోగ్యాస్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలోనే నడిపిస్తాం



రాజన్న గోశాలలో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ మోటార్‌లో సాంకేతిక సమస్య ఉంది. దాన్ని కొనుగోలు చేసిన డీలర్ వద్దకు పంపాం. మోటార్ తీసుకురాగానే బయోగ్యాస్ ప్లాంట్‌ను నడిపిస్తాం.

– రాజేశ్, రాజన్న ఆలయ ఈఈ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కరీంనగర్‌క్రైం: కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు చికిత్స పొందుతూ చనిపోయారు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడ్పుల గ్రామానికి చెందిన భానుప్రకాశ్‌రెడ్డి(21) కుటుంబం ప్రస్తుతం కొత్తపల్లి మండలం చింతకుంటలో నివాసం ఉంటున్నారు. భానుప్రకాశ్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. మంగళవారం స్నేహితులను కలిసేందుకు కరీంనగర్ వచ్చాడు. నగరంలోని హనుమాన్‌నగర్‌లో నివసించే చొప్పరి రిత్విక్, మరో ఇద్దరు స్నేహితులను కలిశాడు. రాత్రి ఒంటిగంట సమయంలో రిత్విక్, భానుప్రకాశ్ రెడ్డి బైక్‌పై మంకమ్మతోట ప్రధాన రోడ్డు వైపు వెళ్తుండగా.. కొత్త లేబర్ అడ్డా సమీపంలో కుక్క అడ్డువచ్చింది. బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో భానుప్రకాశ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడ్డ రిత్విక్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి మృతదేహం లభ్యం


అభిషేక్ మృతదేహం

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం చెరువులో గల్లంతయిన అభిషేక్ మృతదేహాన్ని వెలికితీశారు. జిల్లా కేంద్రంలోని వాణినగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్, లావణ్య కుమారుడు అభిషేక్ తమ బంధువులతో కలిసి అంతర్గాం చెరువుకు ఈతకు వెళ్లారు. ఈత రాకపోవడంతో అభిషేక్ మృతి చెందాడు. అప్పటికే రాత్రి కావడంతో అభిషేక్ మృతదేహం లభ్యం కాలేదు. బుధవారం కూడా గాలింపు చర్యలు చేపట్టగా శవం కనిపించింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


కనకవ్వ(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన కుతాడి కనకవ్వ(40) ఈనెల 20న తన కుమారుడు పర్శరాములుతో కలిసి ముస్తాబాద్‌కు బైక్‌పై వెళ్లింది. నామాపూర్ క్రాసింగ్ వద్దకు రాగానే బైక్ వెనుక టైరులో కనకవ్వ చీర చిక్కుకుని కింద పడిపోయింది. ఈ సంఘటనలో కనకవ్వకు తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కనకవ్వ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కనకవ్వకు భర్త చంద్రం, కుమారుడు పర్శరాములు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవంపల్లికి చెందిన యువకుడు..

మానకొండూర్: మండలంలోని దేవంపల్లికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. చీకట్ల వెంకటేశం(29) కరీంనగర్ వీడియో మిక్సింగ్ షాపులో పనిచేస్తూ జీవనం గడిపేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో మానసికంగా బాధపడుతూ కొద్ది నెలలుగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ నెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని, మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజుకుమార్ తెలిపారు.

ఆన్‌లైన్ ఆటలు.. ఆర్థికంగా కుదేలు

- అప్పులపాలు.. ఆత్మహత్యలు
- చితికిపోతున్న యువత
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పరువుపోతుందని కేసులు పెట్టని వైనం



వేములవాడ: అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను కొందరు మంచికి వినియోగించుకుంటే.. మరికొందరు ఆన్‌లైన్‌గేమ్స్ ఆడుతూ అధఃపాతాళానికి పోతున్నారు. క్రమంగా ఆన్‌లైన్ ఆటలకు అలవాటు పడిన యువత ఎవరిమాట వినకుండా తయారవుతున్నారు. లక్షల రూపాయలు నష్టపోయి పెద్దలకు చెప్పుకోలేక కొందరు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. మరికొందరు తల్లిదండ్రుల ఖాతాల్లో నుంచి దొంగతనాన తీసుకొని అప్పులు చెల్లిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఇటీవల పెరిగిపోయాయి.

నిత్యం ఆన్‌లైన్‌లో..

ఆండ్రాయిడ్ ఫోన్లు, అన్‌లిమిటెడ్ డాటా ఉండడంతో ఎవరిని చూసిన నిత్యం ఆన్‌లైన్‌లోనే ఉంటున్నారు. రమ్మి, క్యాసినో.. తదితర కొత్తకొత్త పేర్లతో అట్రాక్ట్ చేస్తున్న ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ లక్షల్లో నష్టపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా చేతిలో ఫోన్‌తోనే గడుపుతున్నారు. ఇలా అలవాటుపడ్డ వాళ్లలో కొందరి మానసిక స్థితి సరిగ్గా లేకుండా పోయింది. మరికొందరైతే పెద్దల మాటలకు ఎదురుచెప్పడం, కుటుంబ సభ్యులపై దాడి చేయడం వంటి స్థితికి చేరుకుంటున్నారు.

లాభాలు వస్తున్నాయనే ఆశతో..

అప్పుడప్పుడే ఆన్‌లైన్ గేమ్స్ మొదలుపెట్టిన వారికి మొదటల్లో చిన్నపాటి లాభాలు ఆశచూపుతారు. ఇలా ఆ గేమ్స్‌కు ఆకర్షితులను చేసి క్రమంగా డబ్బులు గుంజుతుంటారు. జిల్లాలో ఇలా ఆన్‌లైన్ గేమ్స్ ఆడి కుదేలైన కుటుంబాలు అనేకం ఉన్నాయి. అయితే ఇలా నష్టపోయిన కుటుంబాలకు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నాయి. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో ఫిర్యాదు చేయడం లేదు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడి నష్టపోయిన వారు ఇలా..

- వేములవాడకు చెందిన ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రైల్వేశాఖలో విధులు నిర్వర్తించేవాడు. సహచరులతో ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి ఉన్న ఆస్తిని పోగొట్టుకున్నాడు. అప్పుల పాలు కావడంతో మానసికంగా కుంగిపోయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు రోడ్డున పడ్డారు.
- ఇటీవల వేములవాడలో రూ.2కోట్లతో ఉడాయించిన పూజారి మహేశ్ కూడా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డట్లు సన్నిహితుల ద్వారా తెలిసింది. ఆన్‌లైన్ గేమ్స్ ఆడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నాడని స్నేహితులు తెలిపారు.
- వేములవాడకు చెందిన యువకులు రాజు, వెంకటేశ్, రమణ, శ్రీనివాస్.. ఆన్‌లైన్ గేమ్ పేరుతో క్యాసినో తదితర ఆటలవైపు మొగ్గుచూపారు. దాదాపు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నష్టపోయారు.

అవగాహన కల్పిస్తున్నాం

ఆన్‌లైన్ గేమ్స్, సైబర్‌క్రైమ్‌లపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం. కళాబృందాల ద్వారా గ్రామీణులను చైతన్యం చేస్తున్నాం. యువత ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస కావడం సమాజానికి మంచిది కాదు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. స్కిల్ గేమ్స్ మాత్రమే ఆడాలి. అధిక డబ్బులు వస్తాయని ఆశ చూపే ఏ గేమ్ కూడా వాడొద్దు. అలాంటి గేమ్స్ వాడితే ఆర్థికంగా నష్టపోతారు. ఇలా ంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలి.

– నాగేంద్రచారి, వేములవాడ డీఎస్పీ

ఒలింపిక్ సంఘం ఎన్నికల బరిలో జనార్దన్‌రెడ్డి

- సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్


నామినేషన్ పత్రాలు అందిస్తున్న జనార్దన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గానికి ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 25న విడుదలైంది. నామినేషన్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్ దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని ఒలింపిక్ భవన్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మాజీ జడ్జి సి.ప్రవీణ్ కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. జూన్ 9న జరుగనున్న తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పెద్దపెల్లి జిల్లా జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్ తదితరులు ఉన్నారు.

మరిమడ్లలో దొంగతనం

కోనరావుపేట(వేములవాడ): రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్లలో బుధవారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన చింతలపల్లి సుమన్ రాత్రి వేళ కుటుంబసభ్యులతో కలిసి మేడపైన పడుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 3 జతల కమ్మలు, ఒక జత మాటీలు, 12 తులాల వెండి గొలుసులు, తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గట్టెపల్లిలో ట్రాక్టర్ చోరీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గట్టెపల్లి గ్రామంలోని గోస్కుల ఓదెలకు చెందిన ట్రాక్టర్ మంగళవారం రాత్రి చోరీకి గురైయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తన ఇంటి ముందు ట్రాక్టర్ పార్కింగ్ చేశాడు. ఆ తర్వాత కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన బంధువును చూసేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. ట్రాక్టర్ కనబడకపోవడంతో బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

యువకుడి అదృశ్యం


అబ్దుల్‌రవూఫ్

గోదావరిఖని: స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన అబ్దుల్ రవూఫ్(30) మంగళవా రం ఇంట్లో నుంచి వెళ్లి తిరి గి రాలేదని వన్‌టౌన్ పోలీ సులు తెలిపారు. రాత్రి రెండు గంటల సమయంలో కుటుంబ సభ్యులతో గొడవ పడి మోటార్ సైకిల్‌పై బయటకు వెళ్లాడని పేర్కొన్నారు. తండ్రి మోహినుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. యువ కుని ఆచూకీ తెలిస్తే వన్‌టౌన్ సీఐ 87126 56516, ఎస్సై శ్రీనివాస్ 90100 72555 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

ప్రైవేట్ స్కూళ్ల దందాపై ఉద్యమించండి


మాట్లాడుతున్న రాజు నాయక్

కరీంనగర్: ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై ఉద్యమించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజు నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, ఫైర్ సేఫ్టీ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనుమతి లేకుండా ప్రైవేట్ విద్యాసంస్థలు వెలుస్తున్నాయన్నారు. విద్యార్థులకు సరైన క్రీడా మైదానం, అపార్ట్‌మెంట్ లాంటి భవనాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారన్నారు. విచ్చలవిడిగా టెక్నో, కాన్సెప్ట్, ఎక్స్‌ప్లోరికా, వరల్డ్, ఐఐటీ, జేఈఈ, సీబీఎస్‌ఈ వంటి రకరకాల తోక పేర్లను పెట్టి ఆకర్షించేలా ప్రచారాలు చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్‌స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని వారిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల హాస్టళ్ల ఆగడాలపై ఫుడ్‌ఇన్స్‌పెక్టర్ అధికారులు, విజిలెన్స్ అధికారులు ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు సత్యంనాయక్, జిల్లా కార్యదర్శి మోతిలాల్, తిరుపతి నాయక్, కృష్ణ నాయక్, సక్రు నాయక్, వీరన్న నాయక్, శ్రీను నాయక్, జోహార్ లాల్‌నాయక్, భీమానాయక్, హర్యానాయక్ పాల్గొన్నారు.

మార్కులు తక్కువ వచ్చాయని..


మానస(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): నాయకంపల్లి తండాకు చెందిన మైనేని మానస(15) పదో తరగతిలో మార్కులు తక్కువగా వచ్చా యని మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 6.3 జీపీఏ వచ్చిందని కొద్దిరోజులుగా మనస్తాపంతో ఉంటోంది. జీవితంపై విరక్తితో బుధవారం ఇంట్లో లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అయ్యప్ప ఆలయంలో హుండీ చోరీ


హుండీ ధ్వంసం చేస్తున్న దొంగ(సీసీ ఫుటేజీ)

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్ అయ్యప్పస్వామి ఆలయ హుండీని బుధవారం తెల్లవారుజామున దొంగ పగులగొట్టాడు. అందులోని సొమ్ము అపహరించాడు. రాజీవ్ రహదారి పక్కనే ఉన్న ఆలయంలో జరిగిన హుండీ చోరీకి యత్నించిన దృశ్యాలు గల వీడియో, ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఎస్సై మల్లేశ్ కోరారు.

గ్యాస్ ఏజెన్సీపై కేసు


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రికార్డులు సరిగా నిర్వహించడం లేదంటూ గోదావరిఖనిలోని ఓ వంట గ్యాస్ ఏజెన్సీపై అధికారులు కేసు నమోదు చేశారు. పెద్దపల్లి డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గోదావరిఖని శివాజీనగర్‌లోని రవితేజ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు సరిగా నిర్వహించడం లేదని గుర్తించారు. నిల్వల్లోనూ వ్యత్యాసం ఉందని తేల్చి కేసు నమోదు చేసినట్లు డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వేడెక్కిన రైల్వేట్రాక్


రైల్వేట్రాక్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని రైల్వేట్రాక్‌లు ఎండల తీవ్రతత వేడెక్కుతున్నాయి. ఈక్రమంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో రైల్వేట్రాక్‌పై 58 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఈనెల 4, 5వ తేదీల్లోనూ గరిష్టంగా 59, ఈనెల 3, 6వ తేదీల్లో 58 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పులతో 50–54 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వివరించారు. రైల్వేట్రాక్ వేడెక్కడంతో కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పనివేళల్లో మార్పులు చేసినా.. ఉదయం 8గంటల నుంచే రైల్వేట్రాక్‌పై 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొంటున్నారు. కాంట్రాక్టరు మానవతా దృక్పథంతో ఆలోచించి పనిస్థలాల్లో కనీసం టెంట్ సౌకర్యం కల్పించాలని, చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచాలని, షూస్, టోపీలు, ఓఆర్‌ఎస్‌లు అందజేయాలని, మేలో ప్రత్యేక ఇన్సెంటివ్ చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.


రన్నరప్ ఉమ్మడి కరీంనగర్ టీ20 క్రికెట్ జట్టు

హెచ్‌సీఏ టీ20 రన్నరప్ కరీంనగర్

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న టీ20 క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ టీ20 జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఉప్పల్ స్టేడియంలో బుధవారం మెదక్ జిల్లా జట్టుతో జరిగిన ఫైనల్‌లో జిల్లా జట్టు ఓటమి చెంది రన్నరప్‌గా నిలిచింది. ఉమ్మడి జిల్లా జట్టును జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్ రావు, ఉపాధ్యక్షుడు మహేందర్‌గౌడ్, టీం మేనేజర్ మనోహర్ రావు అభినందించారు.

మాయా‘లేడీ’వలలో సింగరేణి అధికారి

- 8తులాల బంగారం, నగదు, సెల్‌ఫోన్లతో యువతి పరార్

గోదావరిఖని: ప్రియుడితో కలిసి ఓ యువతి సింగరేణి అధికారిని ట్రాప్ చేసి భారీమొత్తంతో పట్టుకుని ఉడాయించినట్లు గోదావరిఖనిలో ప్రచారం జరుగుతోంది. రామగుండం రీజియన్‌లోని సింగరేణి అధికారి ఒకరిని ఓ యువతి మాయమాటలతో తన ట్రాప్‌లోకి దింపినట్లు సమాచారం. తొలుత ఆ యువతి సదరు అధికారి ఇంటికి వెళ్లినట్లు, దీనిగురించి తన ప్రియుడికి ముందే సమాచారం అందించినట్లుగా తెలుస్తోంది. ఆమె వెళ్లిన కొద్దిసేపటికే ప్రియుడు ఆ అధికారి ఇంటికి వెళ్లి బ్లాక్‌మెయిల్ చేసి బెదిరించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో అధికారి నుంచి 8తులాల బంగారం, కొంత నగదు, నాలుగు సెల్‌ఫోన్లతో యువకుడు, యువతి పరారైనట్లు సమాచారం. ఈవిషయంలో సదరు అధికారి పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఈవిషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

వృద్ధురాలి హత్య కేసులో జీవితఖైదు

గోదావరిఖనిటౌన్: రామగుండం ముబారక్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు సమ్మెట బాలమ్మ హత్య కేసులో అదేకాలనీకి చెందిన నగునూరి నరేశ్‌కు జీవిత ఖైదు విధిస్తూ గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. సమ్మెట తిరుపతిపై పాత కక్షలను దృష్టిలో పెట్టుకొన్న అదే కాలనీకి చెందిన నగునూరి నరేశ్.. 2019 మార్చి ఒకటో తేదీన సమ్మెట తిరుపతి తల్లి బాలమ్మను గొడ్డలితో నరికి చంపివేశాడు. తిరుపతి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై దత్తాత్రి కేసు నమోదు చేశారు. సీఐ, ప్రస్తుత ఆర్బీ ఇన్‌స్పెక్టర్ స్వామి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ అజయ్‌బాబు, ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో 14మంది సాక్ష్యులను కోర్టు డ్యూటీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కోర్టు లైజన్ ఆఫీసర్ శంకర్ కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు జిల్లా న్యాయస్థాన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జ్యోతిరెడ్డి తన వాదనలు వినిపించారు. అయితే, నగునూరి నరేశ్‌పై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

హమ్మయ్యా.. చిక్కిన గంజాయి నిందితుడు

- ముంబైలో పట్టుకున్న పోలీసులు


రత్న విలాస్

చందుర్తి(వేములవాడ): నెల రోజుల క్రితం చందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకొని పరారైన గంజాయి నిందితుడు ముంబైలో దొరికాడు. చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు. గత నెల 29న చందుర్తి మండలం మర్రిగడ్డ శివారులో గంగాధర్ మండలం గర్షకుర్తికి చెందిన రత్న విలాస్ గంజాయితో పట్టుబడ్డాడు. అదే రాత్రి చందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి పరారయ్యాడు. ఈ విషయాన్ని పోలీసులు ఉన్నతాధికారుల తీవ్రంగా పరగణించి నిందితుడు రత్న విలాస్ కోసం తీవ్రంగా గాలించారు. అతని సన్నిహితుల కాల్‌డేటా ఆధారంగా మహారాష్ట్ర వైపు పరారైనట్లు గుర్తించారు. జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందాన్ని మహారాష్ట్రకు పంపించారు. నిందితుని కోసం గాలిస్తుండగా ముంబైలోని చండీవాలీ ప్రాంతంలో అరెస్టు చేసి చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తున్నారు.

చార్‌ధామ్ యాత్రకు వెళ్లి.. అనంత లోకాలకు

- గుండెపోటుతో వ్యాపారి మృతి


కృష్ణమూర్తి (ఫైల్)

హుజూరాబాద్ : చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెద్ద పాపయ్యపల్లి గ్రామానికి నార్ల కృష్ణమూర్తి (70) పట్టణంలో 40 ఏళ్లుగా ఆయిల్ మిల్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బద్రీనాథ్ కేదార్‌నాథ్ అమర్నాథ్ తదితర పుణ్యక్షేత్రాలు సందర్శించుకునేందుకు ఈనెల 25న కృష్ణమూర్తి ఇతర యాత్రికులతో కలిసి వెళ్లారు. అక్కడ తీవ్ర అస్వస్థతకు గురై గుండె పోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. గురువారం పార్థివదేహాన్ని స్వగృహానికి తీసుకురానున్నారు.

వాహనం ఢీకొని గేదెలు మృత్యువాత


కళేబారాలు తరలిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణ పరిధిలోని పూసాల సమీప రాజీవ్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృత్యువాత పడ్డాయని మున్సిపల్ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. రైతు ఇంట్లో నుంచి బయటకు రాగానే అటుగా వెళ్తున్న వాహనం ఢీకొందని పేర్కొన్నారు. గేదెల కళేబరాలతో దుర్వాసన వస్తోందని స్థానికులు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీంతో క్రేన్‌సాయంతో కార్మికులు కళేబరాలను లారీలో శ్మశానవాటికకు తరలించి పూడ్చివేశారు.

‘న్యాయ సంహిత’పై కసరత్తు

- పోలీసులకు నాలుగు రోజుల శిక్షణ
- ఐపీసీ సెక్షన్ల నంబర్లలో మార్పులు
- జూలై ఒకటి నుంచి అమలు


శిక్షణ పొందుతున్న పోలీసులు(ఫైల్)

కోరుట్ల: మరో నెలరోజుల వ్యవధిలో ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో అమల్లోకి రానున్న భారతీయ న్యాయ సంహితపై పోలీసులు కసరత్తు ప్రారంభించారు. నాలుగు రోజులుగా జిల్లాకేంద్రంలో జిల్లాలోని వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులకు శిక్షణ మొదలెట్టారు. ఐపీసీ సెక్షన్ల నంబర్లతోపాటు శిక్ష, జరిమానాల్లో బీఎన్ఎస్ ప్రకారం కొంత మార్పులు చోటు చేసుకున్నాయి. పోలీసుశాఖ తరచూ నమోదు చేసే కేసులకు సంబంధించిన సెక్షన్ నంబర్లలో వచ్చిన మార్పులతోపాటు ప్రతీ కేసుకూ నూతనంగా అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఎలా ఉపయోగించుకోవాలన్న విషయంలోనూ అవగాహన కల్పిస్తున్నారు.

సెక్షన్ నంబర్లు.. శిక్షల్లోనూ మార్పులు

కొత్తగా రూపొందించిన భారతీయ న్యాయ సంహిత నేపథ్యంలో ఐపీసీ ప్రకారం గతంలో 511 సెక్షన్లు ఉండగా.. ప్రస్తుతం బీఎన్ఎస్ ప్రకారం వాటిని 358కి కుదించినట్లు సమాచారం. బ్రిటిష్ కాలంలో రూపొందించిన ఐపీసీలో ఉన్న కొన్ని సెక్షన్లు ప్రస్తుత సమకాలీన పరిస్థితులకు అవసరం లేదని భావించిన క్రమంలో ఈ మార్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఐపీసీ 302 సెక్షన్ బీఎన్ఎస్ ప్రకారం 103 నంబర్‌గా మార్పు చేశారు. సాధారణంగా ఎవరైనా కొట్టుకున్న కేసు ఉండే ఐపీసీ కింద 324 సెక్షన్ కింద కేసు నమోదు చేసేవారు. ఇప్పుడు బీఎన్ఎస్ ప్రకారం కొట్టుకుంటే 118 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయనున్నారు. ఈ కేసులో రూ.5వేలు జరిమానా ఉండగా తాజాగా రూ.20వేలు దాకా వేయొచ్చు. బహిరంగంగా మద్యం తాగిన కేసులో జరిమానా ఇదివరకు రూ.200 వరకు ఉండగా.. ఇప్పుడు రూ.500కు పెంచారు. అదే రీతిలో రోడు ప్రమాదంలో హిట్ రన్ కింద నమోదైన కేసుల్లో నిందితులకు గతంలో మూడేళ్ల జైలు శిక్షకు అవకాశం ఉండగా బీఎన్ఎస్ ప్రకారం ఐదేళ్ల వరకు శిక్ష వేయవచ్చు.

ప్రతి కేసుకూ సాంకేతిక సాక్ష్యాలు

ప్రతి కేసులో ఇదివరకు కేవలం రాతపరమైన ధ్రువపత్రాలు, నిందితులు నేర అంగీకారం తెలిపే కాగితాలు, వాటిపై వారి సంతకాలు సేకరించి కోర్టుకు సమర్పించడం ఆనవాయితీగా ఉండేది. ప్రస్తుత కాలంలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని పంచనామాలకు సైతం వీడియో సాక్ష్యాలు, నిందితుల నేర అంగీకరణకు వీడియో రికార్డులు చేయాల్సిన అవసరాన్ని పోలీసు శిక్షణలో తెలియజేస్తున్నారు. పెరుగుతున్న సైబర్ నేరాల పరిష్కారాల్లో ఎలక్ట్రానిక్ సాంకేతిక పరికరాల ఆధారంగా పరిశోధన సాగించి కేసులను త్వరితగతిన పక్కా సాక్ష్యాలతో నిరూపించేలా పోలీసులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ అంశాలపై ప్రతి జిల్లా నుంచి వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న సుమారు పది మంది పోలీసు అధికారులకు ఇదివరకే హైదరాబాద్ పోలీసు అకాడమీలో శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన అధికారులు ప్రస్తుతం భారతీయ న్యాయ సంహితలో జరిగిన మార్పులపై జిల్లా పోలీసులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. జూలై ఒకటో తేది నుంచి నేరాల నమోదు పరిష్కార విధానాలు భారతీయ న్యాయ సంహిత ప్రకారం కొనసాగనున్నట్లు శిక్షణ పొందుతున్న పోలీసులకు ఉన్నతాధికారులు చెబుతున్నారు.